క్లుప్తంగా

ఆలయ భూముల కౌలు వేలం

దోమ: మండల పరిధిలోని దొంగ ఎన్కేపల్లి గ్రామంలో శ్రీ సంజీవ స్వామి దేవాలయ భూములను కౌలుకు వేలం వేయనున్నట్లు ఆలయ ఈఓ బాల నర్సయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి సంబంధించి గూడూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 66లో 14 ఎకరాలు, 135లో 10 ఎకరాల 32 గుంటలు, 173లో 20 ఎకరాల 17 గుంటలు, 174లో 0.38 గుంటల భూములు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ భూములను ఈ నెల 26వ తేదీన సోమవారం ఉదయం 10 గంటలకు దొంగ ఎన్కేపల్లి గ్రామంలోని శ్రీ సంజీవ స్వామి దేవాలయం ఎదుట బహిరంగంగా కౌలుకు వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు రూ.10వేల డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని తెలిపారు. కౌలు కాలపరిమితి మూడు సంవత్సరాల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధారూరు: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని ఏఎంసీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ధారూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏఎంసీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాన్‌సింగ్‌లు పార్టీ నాయకులతో కలిసి రూ.17,30,500ల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఎల్ అశోక్ ముదిరాజ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణను జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కొడంగల్ రూరల్: బొంరాస్‌పేట మండలం కొత్తూరులో 23వ తేదీన నిర్వహించనున్న మహనీయుల విగ్రహాల ఆవిష్కరణను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పోస్టర్ ఆవిష్కరించారు. 23వ తేదీన సాయంత్రం 4గంటల నుంచి నిర్వహించనున్న ఛత్రపతి శివాజీ మహారాజ్, మహాత్మా జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణను జయప్రదం చేయాలన్నారు. దీనికి ఎస్సీ, ఎస్టీ, బీసీలు, అంబేడ్కర్‌వాదులు, ప్రజా సంఘాల నాయకులు, యువకులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎం.కృష్ణంరాజు, బి.వెంకటయ్య, యు.రమేష్‌బాబు, కె.దస్తప్ప, ఎస్.వెంకటేష్, జి.రాము, అంజి, పి.వెంకటయ్య, కె.నరేష్, కుమ్మరి శ్రీనివాస్, కురువ మధు, మహేష్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

సొంత గూటికి మహిపాల్‌రెడ్డి

త్వరలో అనుచరులతో బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు ప్రకటన



పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డిని కలిసిన నాయకులు

పూడూరు: పూడూరు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ఎంపీ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌ను వీడి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఏడాది పాటు పార్టీలో కొనసాగారు. బుధవారం తిరిగి పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు ప్రకటించారు. గ్రామంలో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించి రెండు రోజుల్లో తమ అనుచరులతో బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా కో ఆప్షన్ సభ్యుడు అజీమోద్దీన్, నాయకులు రాంరెడ్డి, రామచంద్రారెడ్డి, జహంగీర్, అమీరలీ తదితరులు పాల్గొన్నారు. మండల అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పని చేసి తిరిగి పార్టీలో చేరడంపట్ల మండలంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు.. ఆపేది లేదు

- డ్రైవర్ల తీరుపై సర్వత్రా ఆరోపణలు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న ప్రయాణికులు



బస్సు ఆపాలంటూ వర్షంలో పరుగులు పెడుతున్న ప్రయాణికులు

తాండూరు టౌన్: ప్రయాణికుల సంక్షేమం దృష్ట్యా గతంలో ప్రభుత్వం చెయ్యి ఎత్తిన చోట ఆర్టీసీ బస్సు ఆపాలని ఆదేశాలు ఉండేవి. కానీ కాలక్రమంలో అలాంటి పరిస్థితులు కనుమరుగయ్యాయని తెలుస్తోంది. చెయ్యి ఎత్తినా, అడ్డంగా నిలుచున్నా ఆపరని అర్థమవుతుంది. ఈ విషయంలో కొందరు డ్రైవర్లు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో వచ్చే బస్సుల కోసం గంటల తరబడి వేచి చూస్తున్న దూర ప్రాంత ప్రయాణికులకు ఉన్న ఒక్క బస్సు ఆపకుండా వెళ్లడంతో దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. ఈ ఘటన బుధవారం తాండూరు పట్టణంలో చోటుచేసుకుంది. జహీరాబాద్ వెళ్లేందుకు సాయంకాలం బస్సు కోసం స్థానిక ఇందిరాచౌక్‌లోని బస్టాప్‌లో ప్రయాణికులు వేచి యున్నారు. ఇంతలో వర్షం మొదలైంది. గంటల తరబడి వేచి చూడగా వచ్చిన బస్సును ఎక్కేందుకు వర్షంలో తడుస్తూ దగ్గరికి వెళ్లినా ప్రయాణికులకు నిరాశే మిగిలింది. వేగంగా ఎవరికీ అందకుండా ఆ బస్సు వెళ్లిపోయింది. ఇలాంటి సందర్భంలో డ్రైవర్ బస్సు ఆపకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. చేసేదేమి లేక ప్రైవేట్ వాహనం కోసం ప్రయాణికుల ఎదురు చూపులు తప్పలేదు. బస్సులో తక్కువ మందే ఉన్నప్పటికీ బస్సు ఆపకుండా వెళ్లిన బస్సు డ్రైవర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు తాండూరు డీఎంను డిమాండ్ చేస్తున్నారు.



అమృత్ మిత్ర సభ్యులతో సమావేశంలో మాట్లాడుతున్న విక్రమ్‌సింహా రెడ్డి

సుందరీకరణకు చర్యలు

- గొల్ల చెరువు కట్టపై నాటనున్న మొక్కలు
- జూన్ 5 నుంచి ప్రారంభం
- మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని గొల్లచెరువు కట్టను సుందరీకరించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన అమృత్ మిత్రులతో సమావేశమయ్యారు. గొల్లచెరువు కట్టపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని మహిళా స్వయం సహాయక గ్రూప్ (అమృత్ మిత్ర) సభ్యులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ అమృత్ 2.0 కేంద్ర ప్రభుత్వ పథకం కింద మంచినీటి సరఫరా, పరిశుభ్రత, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పట్టణ ప్రజలకు అందించాలనే ఉద్దేశ్యంతో గొల్లచెరువు కట్టపై 7,500 మొక్కలు నాటించనున్నట్లు చెప్పారు. జూన్ 5వ తేదీ నుంచి ఆగస్టు చివరి వరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ డీఈఈ మహిపాల్, మేనేజర్ నరేందర్ రెడ్డి, మెప్మా టీఎంసీ రాజేంద్ర ప్రసాద్, కోఆర్డినేటర్ విశాల తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం



పరిగి: చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్, కాంగ్రెస్ నాయకులు



తాండూరు టౌన్: రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి

పరిగి: రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రిగా దేశానికి అంకితభావంతో పనిచేశారని గుర్తు చేశారు. గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా ఆయన తెచ్చిన అధికార వికేంద్రీకరణ చట్టాలు ఎంతో ఫలితాలు ఇచ్చాయన్నారు. ఓటు హక్కును 21 సంవత్సరాల నుంచి 18సంవత్సరాలకు కుదించి ఓటు హక్కు కల్పించిన గొప్ప నాయకుడన్నారు.

తాండూరు టౌన్‌లో..

తాండూరు టౌన్: స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్ గృహకల్ప కాలనీలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశ ప్రధానిగా రాజీవ్ గాంధీ అనేక ఆధునిక సంస్కరణలను తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హబీబ్‌లాలా, మాజీ కౌన్సిలర్లు లింగదల్లి రవి, ప్రభాకర్ గౌడ్, రామకృష్ణ, వెంకన్న గౌడ్, నాయకులు వెంకటయ్య, జిలాని పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణే లక్ష్యం

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శాంతి
- నేటి నుంచి ప్రత్యేక శిబిరాలు



ధారూరు: ధారూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సబ్ సెంటర్ల వారీగా బుధవారం నుంచి క్షయవ్యాధి నివారణకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు డాక్టర్ శాంతి తెలిపారు. పీహెచ్‌సీలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ క్షయవ్యాధి నివారణే లక్ష్యమన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా వంద రోజుల కార్యాచరణ ప్రణాళికతో సబ్ సెంటర్ల వారీగా వైద్య శిబిరాలు నిర్వహిస్తారని ఆమె పేర్కొన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో సంచార వాహనాలతో వైద్య సిబ్బంది పర్యటిస్తారని తెలిపారు. టీబీ సోకిన వారికి, వారి కుటుంబాలకు అనుమానితలక్షణాలు ఉంటే పరీక్షలు నిర్వహించి టీబీని గుర్తిస్తారన్నారు. రోగ బాధితులందరికీ మందులు, వైద్య సలహాలు ఉచితంగా ఇస్తారన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులకు మెయింటెనెన్స్ నిమిత్తం రూ. 1,000 చొప్పున అందజేస్తామన్నారు. టీబీ లక్షణాలున్న వారు విధిగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

రశీదులు తప్పనిసరి

మండల వ్యవసాయ అధికారి గోపాల్

కొత్తూరు: ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే రైతులు సంబంధిత దుకాణం నుంచి తప్పక రశీదులు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటల దిగుబడి పూర్తయ్యే వరకు వాటిని భద్రపర్చుకోవాలని సూచించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే ముందు ప్యాకెట్లపై తయారీ, గడువు తేదీలను గమనించాలని చెప్పారు. సీల్డు ప్యాకెట్లలో నాణ్యమైన, గుర్తింపు ఉన్న పరిశ్రమల విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు



అనంతగిరి: రికార్డులను పరిశీలిస్తున్న పరిగి ఏడీ లక్ష్మి



ధారూరు: ఓ దుకాణంలో రిజిస్టర్ తనిఖీ చేస్తున్న ఏడీఏ లక్ష్మీకుమారి

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో బుధవారం వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా పరిగి ఏడీ లక్ష్మి దుకాణాల్లోని రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. తప్పకుండా స్టాక్ వివరాలు ప్రదర్శించాలన్నారు. విత్తనాలు అమ్మకం, కొనుగోలుకు సంబంధించిన అంశాలను వెంటనే రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. బిల్లులు ఇవ్వకుండా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు సైతం ప్రతి కొనుగోలుకు సంబంధించి తప్పకుండా రశీదు తీసుకోవాలన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విత్తన, ఎరువుల తనిఖీ

ధారూరు: మండల కేంద్రంలోని విత్తన, ఎరువుల విక్రయ దుకాణాలను బుధవారం పరిగి ఏడీఏ లక్ష్మీకుమారి తనిఖీ చేశారు. విత్తనాలను విక్రయిస్తున్న తుల్జాభవానీ, మన గ్రోమార్ దుకాణాలలో తనిఖీ చేసి ఆమె రికార్డులు, పీసీలు, ఇన్‌వాయిస్‌లు, స్టాక్‌ను పరిశీలించారు. పీసీలు లేకుండా ఏ విత్తనం విక్రయించొద్దని డీలర్లను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అమ్మాలని, రైతులకు తప్పనిసగా రశీదులు ఇవ్వాలని సూచించారు. ఏడీఏ వెంట ధారూరు ఏఓ సూర్యప్రకాశ్ ఉన్నారు.

ధాన్యం విక్రయాలు పూర్తి చేయాలి

- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్
- ఇష్టారాజ్యంగా కొనుగోళ్లు కథనానికి స్పందన



చెంగోల్ కొనుగోలు కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

తాండూరు రూరల్: వారంలోపు వరిధాన్యం విక్రయాలు పూర్తి చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. బుధవారం తాండూరు మండలం చెంగోల్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అక్కడే ఉన్న అధికారులతో బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురించిన ఇష్టారాజ్యంగా కొనుగోలు అనే కథనంపై ఆరా తీశారు. అక్కడే ఉన్న డీసీఎంఎస్ మేనేజర్ సలీంపాషాతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గోనూర్ సెంటర్ వద్ద కొనుగోళ్ల ఆలస్యం ఎందుకు అవుతున్నాయని ప్రశ్నించారు. గన్ని బ్యాగుల కొరత ఉందా? అని పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో వర్షం కురుస్తున్నందున ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే రైతులకు గన్ని బ్యాగులు అందజేశామని, అవసరమైతే మరిన్ని బ్యాగులు అందజేసేందుకు సిద్ధం చేశామన్నారు. త్వరగా ధాన్యం కాంటాలు వేయించాలన్నారు. ఆ తర్వాత లారీల్లో మిల్లులకు తరలించాలని సూచించారు.

ఎమ్మెల్యే కృషి మరువలేనిది



తాండూరు రూరల్: జనగాంలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ధారాసింగ్, నారాయణరెడ్డి



దౌల్తాబాద్: రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్
- జనగాంలో సీసీరోడ్డు పనులు ప్రారంభం

తాండూరు రూరల్: పెద్దేముల్ మండల అభివృద్ధికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేస్తున్న కృషి మరువలేమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. పెద్దేముల్ మండలం జనగాం గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.8 లక్షలతో బుధవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..జనగాం గ్రామంలో బీరప్ప ఆలయానికి వెళ్లేదారి అధ్వానంగా మారడంతో గ్రామస్తులు కోరిక మేరకు వెంటనే మంజూరు చేయించారని గుర్తు చేశారు. మారుమూల కర్ణాటక సరిహద్దులోని పెద్దేముల్ మండలంలోని అన్నీ గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం వంటి పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సొసైటీ డైరెక్టర్ నర్సిములు, శివకుమార్, పెంటప్ప, లక్ష్మప్ప, పెద్ద నర్సప్ప, అనంతయ్య, శ్రీను, సంజీవ్, దస్తప్ప, వెంకటప్పలతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

దౌల్తాబాద్: సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావు పేర్కొన్నారు. మండలంలోని అంతారం గ్రామం నుంచి ఈర్లపల్లి గ్రామం వరకు డబుల్ రోడ్డు పనులకుగాను భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత నుంచే కొడంగల్‌లో రూ. వేలకోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వీరన్న, వెంకట్‌రెడ్డి, విజయ్ కుమార్, రెడ్డిశ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి దస్తప్ప, వెంకట్రాములు, కొటంరాములు, భీంరెడ్డి, పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలి

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని కేజీబీవీ విద్యాలయంలో 2025–26విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్‌లో చేరేందుకు అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలని విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ స్రవంతి తెలిపారు. ఎంపీసీ, బైపీసీ సబ్జెక్టులలో తెలుగు మీడియంలో చేరేందుకు విద్యాలయానికి వచ్చి అప్లికేషన్ పెట్టుకోవాలని ఆమె తెలిపారు. పాఠశాలకు సంబంధించి ఆరోతరగతి ఇంగ్లిష్ మీడియంలో విద్యార్థినులను చేర్పించేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 94942 46958, 81878 60659 నంబర్లపై సంప్రదించాలని తెలిపారు.

◆ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కుల్కచర్ల: కుల్కచర్ల మండలంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ హైమద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుల్కచర్ల మండల పరిధిలోని కుల్కచర్ల, పుట్టపహాడ్, బండవెల్కిచర్ల, ముజాహిద్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల నిమిత్తం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు.

◆ దోమ, కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో..

పరిగి: దోమ, కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పరిగి ఏడీఏ వెంకట్‌నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టాపహాడ్‌లోని 33కేవి సబ్‌స్టేషన్ పరిధిలోని దోమ, కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లోని సబ్‌స్టేషన్‌లలో మరమ్మతు పనుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని కోరారు.

◆ పెళ్లికి వంట సామగ్రి అందజేత

కుల్కచర్ల: గ్రామ పరిధిలో ప్రతీ ఇంటి ఆడబిడ్డ పెళ్లికి సాయం అందజేస్తానని పటేల్ చెరువు తండా గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ శాంతిబాయితులసిరాం పేర్కొన్నారు. బుధవారం సదన్ చెరువు తండాకు చెందిన తులసిరెడ్యానాయక్ కుమార్తె సోనా వివాహానికి ఒక క్వింటాల్ సోనబియ్యం, 15కిలోల మంచినూనె, వివిధ వంటసామగ్రిని సాయం చేశారు. ఈ సందర్భంగా శాంతిబాయితులసిరాం మాట్లాడుతూ..6 సంవత్సరాలుగా తను ఈ కార్యక్రమాన్ని చేస్తున్నట్లు చెప్పారు. పేదింటి ఆడబిడ్డకు అండగా నిలవాలన్నదే తమ అభిమతమన్నారు. ఈ కార్యక్రమంలో జగినిబాయి, సేవ్యానాయక్, చుక్కానాయక్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బోధనకు శిక్షణ తరగతులు

పెద్దేముల్ ఎంఈఓ నర్సింగ్‌రావు



కొడంగల్: మాట్లాడుతున్న ఎంఈఓ రాంరెడ్డి

తాండూరు రూరల్: నాణ్యమైన విద్యా బోధనకు శిక్షణ తరగతులు అవసరమని పెద్దేముల్ ఎంఈఓ నర్సింగ్‌రావు పేర్కొన్నారు. బుధవారం పెద్దేముల్ మండలం జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో భాగంగా తెలుగు, పరిసరాల విజ్ఞానం, ఇంగ్లీష్ సబ్జెక్టులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ..ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విద్యార్థులకు పాఠాలు బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి ద్యావరి నరేందర్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్ బందెప్ప, నర్సిరెడ్డి, విజయ, నర్సిములు, శోభన్ బాబు, రహీం, రమేశ్, రాఘవేందర్‌లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయులే కీలకం

అనంతగిరి: విద్యావ్యవస్థలో ఉపాధ్యాయులే కీలకమని రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ మున్నూరు రాజు అన్నారు. వికారాబాద్‌లోని డైట్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను పటిష్టం చేయాలని ఉపాధ్యాయులందరికీ 5రోజుల శిక్షణ ఇస్తుందన్నారు. ఇందులో భాగంగా తెలుగు భాషోపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా బోధనారంగంలో వినూత్నమైన వేగవంతమైన మార్పులు వస్తున్నాయని, వాటన్నింటిని అధ్యయనం చేస్తూ అవసరమైన వాటిని స్వీకరించాలన్నారు. కేవలం పాఠ్యాంశాలే కాకుండా పాఠ్యేతర విషయాలను కూడా అందించి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ ఏయంఓ రాంరెడ్డి, సెక్టోరియల్ ఆఫీసర్ రజిత, డీఆర్‌పీలు సుధాకర్‌గౌడ్, పరమేశ్వర్, రాజ్‌కుమార్, శేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

కొడంగల్: మెరుగైన విద్యా బోధనకు ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రెండో రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాంరెడ్డి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఈ నెల 24వ తేదీ వరకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.

కనీస సామర్థ్యాలు అవసరం

మోమిన్‌పేట: ప్రతి విద్యార్థికి కనీస సామర్థ్యాలు ఉండే విధంగా తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని మండల విద్యాధికారి మల్లేశం పేర్కొన్నారు. మండల బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు చదవడం, రాయడం, గణితంలో కూడికలు, తీసివేతలు, భాగాహారం, గుణింతాలు వచ్చి ఉండాలని ఆయన సూచించారు. అందుకు అనుగుణంగా విద్యార్థులకు బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.



తాండూరు రూరల్: పెద్దేముల్‌లో మాట్లాడుతున్న ఎంఈఓ నర్సింగ్‌రావు



అనంతగిరి: మాట్లాడుతున్న డాక్టర్ రాజు